# యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**

కష్ట కాలంలో ఉన్న ప్రజలను కాపాడుకునేందుకు వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిస్థితులను మంగళవారం ఆయా జిల్లా కలెక్టర్‌లతో ఆయన టెలిఫోన్ లో సమీక్షించారు. పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్, తిరుమలయపాలెం మండలాల్లో పర్యటించారు.గంట గంటకు హైదరాబాద్‌లోని విపత్తుల నిర్వహణ విభాగం అధికారులతో మాట్లాడుతూ వారిని అప్రమత్తం చేస్తూ వారికి ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీచేశారు. వరద ప్రభావిత ప్రాంతాలల్లో నెలకొన్న పరిస్థితులకు అనుగుణంగా సహాయక చర్యలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. విపత్తుల నిర్వహణ విభాగంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు వస్తున్న ఫిర్యాదులు, తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. పంట నష్టం, ఆస్తి నష్టం వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని పూర్తి వివరాలను జిల్లాల నుంచి తెప్పించుకోవాలని ఆయన సూచించారు.



ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో 117 గ్రామాల్లో 67 వేల మంది భారీ వర్షాలు, వరదల వల్ల ప్రభావితమయ్యారని, ఇందులో ఒక ఖమ్మం జిల్లాలోనే 49 వేల మంది ఉన్నారని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 133 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి 10,538 మందిని తరలించినట్టు ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల 3,039 మందిని రక్షించుకోగలిగామని ఆయన తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఇప్పటి వరకు 44 ఇళ్లు పూర్తిగా దెబ్బతినగా 600 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే ఇళ్లు పూర్తిగా కోల్పోయిన వారికి కొత్తగా మంజూరుచేయాలని, పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లకు వెంటనే మరమ్మతులను చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. 51 బ్రిడ్జిలు, 249 కల్వర్ట్, 166 ట్యాంక్‌లు దెబ్బతిన్నాయని, 13,342 జీవాలు మృతి చెందాయని ఆయన తెలిపారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం, త్రాగునీరుకు ఏలోటు రాకుండా అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. వరద భాదితులు ఎదురు చూడాల్సిన పరిస్థితులు కల్పించకుండా సమయానికి ఆహారాన్ని అందించాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో అసలైన సవాలు ఇప్పుడు ఎదురవుతుందని మానవీయ కోణంలో సహాయ చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా వృద్దులు, గర్భిణీలు, పసిపిల్లలు, దివ్యాంగుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. మరికొన్ని రోజులు ఇదేవిధంగా అప్రమత్తంగా ఉండాలని, నష్ట పోయిన వారిని ఆదుకుంటూ కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలవాలని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ మళ్లీ సాధారణ జీవితం గడిపేలా చరవేగంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వర్షాలు తగ్గడంతో వరదలు తగ్గుముఖం పట్టి బురదమయమైన ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

# 30 వేల ఎకరాల్లో పంట నష్టం ..!

**బలగం టీవి, హైదరాబాద్**




మహబూబాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి అక్కడ జరిగిన నష్టాన్ని పరిశీలించారు. పురుషోత్తమాయ గూడెంలో పర్యటించిన ఆయన ఆకేరు వాగుపై దెబ్బతిన్న వంతెన వద్దకు వెళ్లారు. అనంతరం సీతారాం నాయక్ తండాలో వరద బాధితులను పరామర్శించారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అధికారులు ఉన్నారు.

అనంతరం వరద నష్టంపై మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో సీఎం సమీక్ష నిర్వహించారు. మొదట కలెక్టరేట్‌లో ఫొటో ప్రదర్శనను తిలకించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ తర్వాత మంత్రులు, అధికారులతో కలిసి సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఎన్ని చర్యలు చేపట్టినా కొంత ప్రాణనష్టం జరిగింది. ప్రభుత్వ ఆస్తులు దెబ్బతినడం చాలా బాధాకరం. సచివాలయం నుంచి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉన్నాను. మహబూబాబాద్‌లో నలుగురు మృతి చాలా బాధాకరం. దాదాపు 30 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. అని అన్నారు.

## రైళ్ల రాకపోకల పునరుద్ధరణ

**బలగం టీవి, హైదరాబాద్**

: రైల్వే ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభ వార్త చెప్పింది. బుధవారం నుంచి సికింద్రాబాద్–విజయవాడ, వరంగల్–విజయవాడ మార్గాల్లో రైళ్ల రాకపోకలను పునరుద్ధరించినట్లు చెప్పింది. భారీ వర్షాలకు మహబూబాబాద్ తడల పూసలపల్లి వద్ద కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు శరవేగంగా పూర్తి చేసింది.ట్రయల్ రన్ కూడా పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు.ఇటీవలి వరదలకు ఇక్కడి రైల్వే ట్రాక్ కొట్టుకుపోయింది. వెంటనే రంగంలోకి దిగిన ఇండియన్ రైల్వే 48 గంటల్లోనే తాళ్ల పూసలపల్లి దగ్గర ట్రాక్ ను పునరుద్ధరించింది. దాదాపు 1000 మంది సిబ్బంది మూడు రోజులపాటు శ్రమించి యుద్ధప్రాతిపదికన ట్రాక్‌ను పునరుద్ధరించింది.



మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన పదో తరగతి విద్యార్థిని ముత్యాల సాయి సింధు వరద సహాయక కార్యక్రమాల కోసం తన ఔదార్యాన్ని చాటుకున్నారు. వరదల్లో సర్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వానికి అండగా నిలవడానికి తన కిట్టీ బ్యాంకులో పొదుపు చేసుకున్న3 వేల రూపాయలను ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా అందించారు. మహబూబాబాద్ కలెక్టరేట్ లో ముఖ్యమంత్రి ప్ర.రేవంత్ రెడ్డిని కలిసి ఈ సహాయాన్ని అందజేయగా ముఖ్యమంత్రి ఆ అమ్మాయిని అభినందించారు. **బలగం టీవి, హైదరాబాద్**

# బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఫెయిల్

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవి, ఖమ్మం**

ఖమ్మం జిల్లాలో వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

మూడు నాలుగు రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు ఖమ్మం జిల్లాలో తీవ్రమైన నష్టం జరిగింది. సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాల వల్ల జనజీవనం అతలాకులతమైంది. భారీగా ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరిగింది. వరదల విషయంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడం వల్ల, ప్రజలను అలర్ట్ చేయకపోవడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం పెద్ద ఎత్తున జరిగిందని హరీశ్‌రావు అన్నారు. .

పార్టీ తరపున వరద బాధితులకు సహాయం అందించేందుకు సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్, జగదీశ్ రెడ్డి, రవిచంద్ర, నామా నాగేశ్వర్ రావు, వివేకానంద గౌడ్, కౌశిక్ రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, శంభీపూర్ రాజు వచ్చాం. ప్రభుత్వం చేపడుతున్న వరద చర్యలు పరిశీలించేందుకు వచ్చాం. పాలేరు నియోజకవర్గంలో



మాజీ ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డి సహాయం అందించారు. పువ్వాడ అజయ్ ఖమ్మంలో ఆయా డివిజన్ల ప్రజలకు నిత్యావసరాలు అందిస్తున్నారు. ఖమ్మం ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని ముందుకు వచ్చామని హరీశ్‌రావు అన్నారు. .. వార్డుల్లో ప్రజలను కలుస్తుంటే పరిస్థితి హృదయ విదారకంగా ఉంది. కళ్లల్లో నీళ్లు పెట్టుకుం టున్నారు. పసి పిల్లలకు పాలు దొరకక బాధపడు తున్నారు. తాగడానికి మంచినీళ్లు లేవు.. నిత్యావసరాలు అందించడంలో ప్రభుత్వం విఫలం చెందిందని ఆవేదన వ్యక్తం చేశారని హరీశ్‌రావు తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యంగ్యం ఎక్కువ, పనితనం తక్కువ అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఖమ్మంలో 9 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే 9 మంది ప్రాణాలు కూడా కాపాడలేక పోయారని... వాతావరణ శాఖ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించిన ప్రభుత్వం పట్టించుకోలేదు అని హరీశ్ రావు ధ్వజమెత్తారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యంగ్యం ఎక్కువ, పనితనం తక్కువ అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఖమ్మంలో 9 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే 9 మంది ప్రాణాలు కూడా కాపాడలేకపోయారు. వాతావరణ శాఖ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించిన ప్రభుత్వం పట్టించుకోలేదు అని ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు.

ఎక్కడా చూడు వ్యంగమే.. పాలనపై రేవంత్ రెడ్డి పట్టు కోల్పోయారు. చీటిమాటికి ప్రతిపక్షాలపై బురద జల్లుతున్నారు. ఇంకా మొద్దు నిద్ర నుంచి మేల్కొనలేదు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున వర్షాలు పడబోతున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించినా ప్రభుత్వం ముందుస్తు చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రాణ, ఆస్తి నష్టం భారీగా జరిగింది. దాదాపు ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షల వరకు నష్టం జరిగింది. కట్టుబట్టలతో బయటపడ్డామని వరద బాధితులు ఆవేదన చెందుతున్నారు. సర్టిఫికెట్లు, బియ్యం, నిత్యావసర వస్తువులు తడిసిపోయాయని కన్నీరుమున్నీరు అవుతున్నారు. కష్టపడి సంపాదించుకున్న బంగారం కొట్టుకుపోయిందంటున్నారు. 12 గంటల పాటు తాగడానికి నీళ్లు లేక విలవిలలాడిపోయారట. రెండు రోజుల నుంచి తినడానికి తిండి లేదని బాధపడుతున్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం అని హరీశ్‌రావు మండిపడ్డారు.

చనిపోయిన కుటుంబాలకు రూ. 25 లక్షలు ఇవ్వాలని ఇదే రేవంత్, సీతక్క ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అడిగారు. ఆ మాట ప్రకారం తక్షణమే చనిపోయిన కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వండి. మాట మీద నిలబడాలని డిమాండ్ చేస్తున్నాం. వరదలో పూర్తిగా మునిగిన ఇండ్లకు తక్షణమే రూ. 2 లక్షలు సాయం చేయాలని కోరుతున్నాం. మీరు ఇచ్చే రూ. పది వేలు ఏ మూలకు సరిపోవు.. దయచేసి ఆదుకోండి.. పిల్లల సర్టిఫికెట్లు తడిసి ముద్దయ్యాయి.. వారందరికి ఉచితంగా సర్టిఫికెట్లు అందజేయాలని డిమాండ్ చేస్తున్నాం. బియ్యం ఇచ్చినా వండుకొనే పరిస్థితి లేదన్నారు. ఇంట్లో బురద ఉన్నాక ఎలా వండుకుంటామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివాళాకోరు ప్రభుత్వం ఇది. రేవంత్ రెడ్డికి వ్యంగం ఎక్కువ.. మోకాలికి, బోడిగుండుకు లింక్ పెట్టి పిచ్చి మాటలు మాట్లాడే ప్రయత్నం చేస్తున్నాడని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

వరద సహాయక చర్యల్లో కేంద్రం కూడా విఫలమైంది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను, హెలికాప్టర్లను పంపలేకపోయింది. ప్రజల ప్రాణాలను కాపాడడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. సీఎంను డిమాండ్ చేస్తున్నాం.. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి. మోదీని నిలదీద్దాం.. సహాయం ఎందుకు చేయరో అడుగుదాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల ప్రజలు బలయ్యారని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# యాంటీ రేప్ బిల్లుకు బెంగాల్ అసెంబ్లీ ఆమోదం



**బలగం టీవి,కోల్‌కలతా**

ది అపరాజిత వుమెన్ అండ్ చైల్డ్ (వెస్ట్ బెంగాల్ క్రిమినల్ లాస్ ఎమెండ్‌మెంట్) బిల్లు 2024ను పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ మంగళవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ బిల్లును రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి మోలోరు ఘటక్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు చారిత్రాత్మకమైనదని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అభివర్ణించారు. 'బిల్లుపై సంతకం చేయాలని గవర్నర్‌ను కోరాలని' బీజేపీ ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందిన తరువాత గడువులోగా విచారణ పూర్తి చేసేందుకు స్పెషల్ అపరాజిత టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ బిల్లు ప్రకారం అత్యాచారం తరువాత లేదా అత్యాచారానికి పాల్పడిన వారి చర్యల ద్వారా బాధిత మహిళ మరణించినా, మళ్లీ కోలుకోలేని స్థితిలో మహిళ ఉన్నా దోషులకు మరణశిక్ష విధిస్తారు. కొల్‌కతాలోని ఆర్‌జి కర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటన నేపథ్యంలో ఈ బిల్లును బెంగాల్ ప్రభుత్వం తీసుకొచ్చింది.

ఈ బిల్లు సందర్భంగా సీఎం మాట్లాడుతూ కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలి ఘటనలో నిందితుడికి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఆగస్టు 9వ తేదీన లేడీ డాక్టర్ మృతిచెందిన తర్వాత.. ఆ రోజే ఆమె పేరెంట్స్‌తో మాట్లాడినట్లు చెప్పారు. వాళ్ల ఇంటికి వెళ్లడానికి ముందే.. ఆడియో, వీడియో, సీసీటీవీ ఫూటేజ్‌ను అందజేసినట్లు చెప్పారు. ఆదివారం వరకు సమయం ఇవ్వాలని ఆ డాక్టర్ పేరెంట్స్‌ను కోరామని, ఒకవేళ దోషిని పట్టుకోకుంటే అప్పుడు కేసును సీబీఐకి అప్పగిస్తామని చెప్పామన్నారు. కానీ పోలీసులు 12 గంటల లోపే నిందితుడిని పట్టుకున్నారని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కేసును పరిష్కరించాలని పోలీసులకు చెప్పినట్లు సీఎం వెల్లడించారు. కానీ కేసును సీబీఐకి అప్పగించారని, అందుకే సీబీఐ ఈ కేసులో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామని, నిందితుడికి మరణశిక్ష విధించాలని ముందు నుంచి డిమాండ్ చేస్తున్నట్లు మమతా బెనర్జీ తెలిపారు.



## ఏడుపాయల ఆలయం చుట్టూ వరద

**బలగం టీవి, హైదరాబాద్**

భారీ వర్షాలతో మెదక్ జిల్లా ఏడుపాయల వన దుర్గామాత ఆలయం చుట్టూ మంజీరా వరద చేరింది. దీంతో ప్రత్యేక పూజల అనంతరం గర్భగుడిని అర్చకులు మూసివేశారు. మంజీరా బ్యారేజ్ గేట్లు ఎత్తడంతో ఏ క్షణాన అయినా భారీగా వరద వచ్చే అవకాశముంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వన దుర్గామాత ఆలయ పరిసర ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

# వారం రోజుల్లో 'గాంధీ'లో ఐవీఎఫ్ ప్రారంభం

- మంత్రి దామోదర రాజనర్సింహ
- గాంధీ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి

**బలగం టీవి, హైదరాబాద్**



సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్‌లో వారం రోజుల్లో ఐవీఎఫ్ కేంద్రాన్ని ప్రారంభిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం మంత్రి గాంధీ హాస్పిటల్‌ను ఆసక్మికంగా తనిఖీ చేశారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వం కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి లు ఆసుపత్రికి చేరుకున్నారు. సీజనల్ వ్యాధుల కట్టడిలో భాగంగా గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ప్రస్తుతం ఎంతమంది డాక్టర్లు డ్యూటీలో ఉన్నారు. వారి వివరాలు అందించాల్సిందిగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి అడిగి తెలుసుకున్నారు. నర్సింగ్ సిబ్బంది, డయాగ్నోస్టిక్ క్లినికల్ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. వైరల్ ఫీవర్ కేసులు ఎక్కువవుతున్న సమయంలో వైద్యులెవరూ సెలవులు పెట్టకూడదని విధులకు హాజరై ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ తో పాటు వైద్యులకు ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సూచించారు.



## డిండి వాగులో చిక్కుకున్న చెంచులు

- కాపాడిన రెస్క్యూ బృందాలు

**బలగం టీవి, హైదరాబాద్**

డిండి వాగులో చిక్కుకున్న చెంచులు సురక్షితంగా బయట పడ్డారు. వాగులో చిక్కుకున్న పది మందిని పోలీసు రెస్క్యూ బృందాలు రక్షించాయి. గోనబోయినపల్లికి చెందిన చెంచులు ఆగస్టు 31వ తేదీన చేపల వేటకు వెళ్లారు. ఈ క్రమంలో అచ్చంపేట మండలం సిద్ధాపూర్ వద్ద డిండి వాగులో వారు చిక్కుకుపోయారు. తాము వాగులో చిక్కుకుపోయినట్లు గ్రామస్తులకు సోమవారం సమాచారం అందించారు. దీంతో నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అప్రమత్తమయ్యారు. ఎస్పీ ఆదేశాలతో రంగంలోకి దిగిన జిల్లా పోలీసులు.. డ్రోన్ కెమెరాల సహాయంతో వారున్న ప్రదేశాన్ని గుర్తించారు.

వరద నీటిలో చిక్కుకుపోయిన బాధితులకు తొలుత ఆహార పదార్థాలను అందించారు. అయితే.. వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో రెస్క్యూ ఆపరేషన్‌ను నిలిపివేశారు. మంగళవారం ఉదయం నాగర్ కర్నూల్ పోలీసుల సహాయంతో వారిని క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. సహాయక చర్యల్లో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు పాల్గొన్నారు. కాగా, చెంచులను రక్షించిన పోలీసులను డీజీపీ జితేందర్ అభినందించారు

# ఏపీ, తెలంగాణ సీఎంల సహాయనిధికి సూపర్ స్టార్, పవర్ స్టార్‌ల భారీ విరాళం





**బలగం టీవి, హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాలు వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో సూపర్ స్టార్ మహేష్ బాబు, పవర్ స్టార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రెండు తెలుగు రాష్ట్రాలకు భారీ విరాళం ప్రకటించారు."రెండు తెలుగు రాష్ట్రాలను వరదలు ప్రభావితం చేస్తున్న దృష్ట్యా.. నేను ఏపీ మరియు తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు 50 లక్షల చొప్పున ఒక్కొక్కరికి విరాళం ఇస్తున్నాను. వరద ప్రభావిత ప్రాంతాలకు తక్షణ సహాయం అందించడానికి మరియు పునరుద్ధరణ ప్రక్రియను సులభతరం చేయడానికి సంబంధిత ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలకు సమిష్టిగా మద్దతు ఇద్దాం. ఈ ప్రయత్నానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నేను కోరుతున్నాను. మనం ఈ సంక్షోభాన్ని అధిగమించి, మరింత బలంగా ఎదగాలి.."

అలాగే వరద బాదితుల సహాయార్థం ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆ మొత్తాన్ని అందచేయనున్నట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే ఈ ప్రకృతి విపత్తు చోటు చేసుకోవడం బాధించిందని తెలిపారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నాశనం చేసినట్లు బుడమేరుకు సంబంధించిన పనులను కూడా నిర్లక్ష్యం చేయడం వల్లే ఇంతటి విపత్తు ఇపుడు చోటుచేసుకుందని తెలిపారు. ఈ విపత్తుతో ప్రాణ నష్టంతోపాటు పెద్దఎత్తున ప్రభుత్వ, ప్రవేట్ ఆస్తులకు నష్టం వాటిల్లిందన్నారు.

అలాగే వైజయంతీ మూవీస్– ఏపీకి రూ. 25 లక్షలుత్రివిక్రమ్ – రాధాకృష్ణ – నాగవంశీ: ఏపీకి రూ. 25 లక్షలు, తెలంగాణకు రూ. 25 లక్షలు ఆయ్ మూవీ నిర్మాత బన్నీ వాస్: 'ఆయ్' ఈ వారం కలెక్షన్స్‌లో 25 శాతం ఏపీకి, వెంకీ అట్లూరి– ఏపీకి రూ. 5 లక్షలు, తెలంగాణకు రూ. 5 లక్షలు, అనన్య నాగళ్ల– ఏపీకి రూ. 2.5 లక్షలు, తెలంగాణకు రూ. 2.5 లక్షలు ప్రకటించారు.



# ఇంటర్ కాంటినెంటల్ కప్ ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్**



మూడు దేశాలు పాల్గొనే ప్రతిష్టాత్మక ఇంటర్ కాంటినెంటల్ కప్ (4వ ఎడిషన్) 2024 ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతోన్న టోర్నమెంట్‌లో ఇండియాతో పాటు మారిషస్, సిరియా దేశాల జట్లు తలపడతాయి. ఇండియా, మారిషస్‌ల మధ్య తొలి మ్యాచ్ ఓపెనింగ్ సెర్మనీలో ముఖ్యమంత్రి గారు పాల్గొన్నారు.

ఇండియా, సిరియా, మారిషస్ దేశాల జరిగే ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించాలని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య నిర్ణయించడం పట్ల ముఖ్యమంత్రి గారు సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ క్రీడాభిమానులు, ముఖ్యంగా హైదరాబాద్ ఫుట్‌బాల్ ప్రియుల తరపున ఆటగాళ్లకు ముఖ్యమంత్రి గారు స్వాగతం పలికారు. హైదరాబాద్‌ను దేశ క్రీడా రాజధానిగా మార్చాలన్న తమ ప్రభుత్వ ప్రయత్నమని వివరించారు. టోర్నమెంట్‌ను ప్రారంభించిన అనంతరం అన్ని జట్ల ఆటగాళ్లకు సీఎం శుభాకాంక్షలు తెలియజేశారు.

మూడు జట్ల మధ్య మూడు మ్యాచులు (రౌండ్ రాబిన్ ఫార్మేట్) జరగనుండగా, సెప్టెంబర్ 6న మారిషస్ వర్సెస్ సిరియా, 9 వ తేదీన ఇండియా వర్సెస్ సిరియా జట్లు తలపడనున్నాయి.

ఇంటర్ కాంటినెంటల్ కప్ 2024 ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి గారు, ఆల్ ఇండియా ఫుట్ బాల్ ఫెడరేషన్ అధ్యక్షుడు కల్యాణ్ చౌబే గారు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలంతా ఐకమత్యంతో ముందుకు వెళ్దాం..



- పండుగకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం ఉంటుంది..
- గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిద్దాం..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిద్దామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయక విగ్రహాల మండపాల బాధ్యులు, ఆయా శాఖల అధికారులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, ముస్లిం, క్రైస్తవ ప్రతినిధులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రజలంతా ఐక్యమత్యంతో చేసుకోవాలని, మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఇతర దేశాలకు ఆదర్శ ప్రాయంగా నిలుస్తున్నాయని అన్నారు.పండుగకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం ఉంటుందని,మండపాల నిర్వాహకులు, యువత అధికారులు చెప్పే సలహాలు పాటించాలని,ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో చేసుకోవాలని అన్నారు.పోలీస్ శాఖ నిబంధన మేరకు రెండు సౌండ్ బాక్స్ లు పెట్టుకోవాలని, నిర్వహకులు ఏ రోజున నిమజ్జనం చేస్తున్నారో పోలీస్ శాఖ వారికి తెలియజేయాలని అన్నారు . హైదరాబాద్‌లో ఇప్పటికే వినాయక నవరాత్రి ఉత్సవాలపై సీఎం సమావేశం నిర్వహించారని,ఏ ఇబ్బంది ఎదురైనా తాము అండగా ఉంటామని అన్నారు . ఉత్సవాలు ప్రారంభం నుంచి నిమజ్జనం అయ్యేదాకా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

**సమన్వయంతో విజయవంతం చేయాలి..**

ఈ నెల 7వ తేదీన మొదలు కానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్, సెస్, మత్స్య, పోలీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లపై చర్చించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా కావాల్సిన క్రేన్స్, జేసీబీలు, విద్యుత్ దీపాలు, నీటి సదుపాయం కల్పించాలని ఆయా కమిషనర్లు ఆదేశించారు. మండపాల వారీగా మున్సిపల్ సిబ్బందిని నియమించి పారిశుధ్య పనులు చేయించాలని సూచించారు.

సెస్ అధికారులు వినాయక మండపాలు, నిమజ్జనం రోజున విగ్రహాలు వెళ్లే దారిలో విద్యుత్ తీగలు ఎత్తు పెంచి ఇబ్బంది కలగకుండా చూడాలని, సమస్యల పరిష్కారానికి ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించాలని ఆదేశించారు.

మత్స్య శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడ లో 18 మంది చొప్పున జాలర్లను నియమిస్తామని ఆ శాఖ అధికారులు తెలుపగా, మరో పది మందిని రిజర్వ్ లో వుంచి, లైఫ్ జాకెట్లు సమకూర్చాలని ఆదేశించారు. ఎక్సైజ్, అగ్ని మాపక శాఖలు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు.

**నిర్ణీత సమయానికి నిమజ్జనం చేయాలి..**

జిల్లాలోని అన్ని మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా తమ మండపం, విగ్రహం ఎత్తు, ఏ రోజున నిమజ్జనం చేస్తారో వివరాలు ఇవ్వాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు . ఆయా తేదీల్లో విగ్రహాలను నిర్ణీత సమయానికి తరలించి, రాత్రి రెండు గంటల వరకు నిమజ్జనం చేసేలా అందరూ సహకరించాలని అన్నారు . ప్రతి మండపం వద్ద ప్లాస్టిక్ డ్రమ్ములో నీరు, ఇసుక నిలువ ఉంచాలని సూచించారు. పోలీస్ శాఖ వారి https://policeportal.tspolice.gov.in/index.htm వెబ్సైట్ లో వివరాలు నమోదు చేయాలని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బంది ఎదురైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్లు జిందం కళ, రామతీర్థం మాధవి వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, మున్సిపల్ కమిషనర్లు మీర్జా ఫసహత్ అలీ బేగ్, సంపత్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థికీ రక్త నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి




- తీవ్ర పోషణ లోపంతో ఉన్న పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలి..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

తీవ్ర పోషణ లోపంతో ఉన్న పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలనీ,పిల్లలు, గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు . మంగళవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన ఈ నెల 1 నుంచి 30 వరకు చేపట్టనున్న పోషణ అభియాన్ జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మి రాజం జిల్లాలో పోషణ మాసం షెడ్యూల్, కార్యాచరణ ప్రణాళిక ను కలెక్టర్ కు వివరించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ మాట్లాడుతూ ప్రతి పిల్ల వాడి ఎత్తు, బరువులు తీసి తద్వారా పోషణ లోపం,తీవ్ర పోషణ లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు.వీరితో పాటు హాస్టల్స్, స్కూళ్లలో విద్యార్థులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేయాలని అన్నారు. సివియర్ ఎనిమిక్ తో బాధపడుతున్న వారిని గుర్తించి జిల్లా ఆసుపత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రిలో చేర్పించి చికిత్సను అందించాలని అన్నారు.

పోషణ లోపం,తీవ్ర పోషణ లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి అదనపు పోషకాహారం అందించడంతో పాటు వైద్య శాఖ సిబ్బంది సమన్వయంతో వైద్య పరీక్షలు చేపట్టి పిల్లలు సాధారణ స్థితికి వచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు . తదుపరి సోమవారం మళ్లీ రివ్యూ ఉంటుందని,ఈ సందర్భంగా ప్రతి అంగన్వాడీ టీచర్ తమ పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాలలో డ్రైడేలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ వినోద్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం,జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంత రావు, డీఆర్డీఓ శేషాద్రి, డీఏఓ అఫ్జల్ బేగం, డీఎస్ సీడీఓ విజయ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్లు మీర్జా ఫసహత్ అలీ బేగ్, సంపత్ రెడ్డి, డీఎల్పీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.



# టీయూడబ్ల్యూజే (ఐజేయు)లో చేరిన తంగళ్లపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు

- సభ్యత్వాలు ఇచ్చి యూనియన్‌లో చేర్చుకున్న జిల్లా అధ్యక్షుడు సంతోష్

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దొంతుల ఆంజనేయులు, పిల్లి శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో 26 మందికి గాను 23 మంది సభ్యులు మంగళవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టియూడబ్ల్యూజే ఐజేయులో చేరారు.స్థానిక తంగళ్ళపల్లి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో టియూడబ్ల్యూజే (ఐజేయు) రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దండి సంతోష్ కుమార్ వారికి సభ్యత్వాలను నమోదు చేయించి రశీదులను అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు సంతోష్ కుమార్ మాట్లాడుతూ 65 సంవత్సరాల ఉద్యమ వారసత్వ చరిత్ర కలిగిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం లో తంగళ్ళపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు సభ్యత్వం పొందడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు.

జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం ,భద్రత కోసం చిత్తశుద్ధితో పోరాటం చేస్తున్న యూనియన్ టియూడబ్ల్యూజే (ఐజేయు) అని చెప్పారు. యూనియన్ ఉద్యమ వారసత్వాన్ని అందిపుచ్చుకొని రాష్ట్ర నాయకత్వం మార్గదర్శకంలో మనమందరం ఐక్యంగా పని చేద్దామని పిలుపునిచ్చారు.తనకి అవకాశం ఇచ్చిన తంగళ్ళపల్లి ప్రెస్ క్లబ్ కు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముత్యం, రాష్ట్ర లీగల్ అడ్వైజరి కమిటీ సభ్యులు రేగుల దేవేందర్,పిల్లి శ్రీనివాస్,అందె దేవేందర్, దొంతుల ఆంజనేయులు, వెంగళ శ్రీనివాస్, లింగారెడ్డి, రంగు శ్యామ్, సిరిపాక ప్రణయ్, రెడ్డి రాజశేఖర్,దుబ్బాక రాజు, గాధగోని సాగర్, పరుశరాములు,దినేష్, రాజేష్,ప్రశాంత్,లింగారెడ్డి, మధు,పరశురాములు,శ్రీనాథ్ రావు,యశ్పాల్,యాదగిరి, సంతోష్ కుమార్,రాజశేఖర్, బాలు,రామచంద్రం, దేవేందర్ లు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం..

**బలగం టీవీ , సిరిసిల్ల**

ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 26 మంది టీచర్లు ఎంపికయ్యారు. జాబితాను డీఈవో ఎ. రమేష్ కుమార్ మంగళవారం ప్రకటించారు. సెప్టెంబర్ 5న కలెక్టరేట్లోని ఆడిటోరియంలో అవార్డులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

**ఎంపికైన ఉపాధ్యాయులు వీరే...**

బి. సదానందం, గెజిటెడ్ హెడ్మాస్టర్ జడ్పిహెచ్ఎస్ కోనాయిపల్లి,జి. కృష్ణహారి, గెజిటెడ్ హెడ్మాస్టర్ జడ్పిహెచ్ఎస్ రాచర్ల తిమ్మాపూర్, బి. గోవింద రావు, స్కూల్ అసిస్టెంట్ జడ్పిహెచ్ఎస్ (బాలురు) సిరిసిల్ల,డి. రాజిరెడ్డి, స్కూల్ అసిస్టెంట్ జడ్పిహెచ్ఎస్ లింగన్నపేట,కె. రవి స్కూల్ అసిస్టెంట్ జడ్పిహెచ్ఎస్ చంద్రంపేట,వి. వసుంద,స్కూల్ అసిస్టెంట్ జడ్పిహెచ్ఎస్ విలాసాగర్,డి. శరత్ కుమార్ స్కూల్ అసిస్టెంట్ జడ్పిహెచ్ఎస్ వట్టిముల్ల,ఎన్. నీరజ స్కూల్ అసిస్టెంట్ జడ్పిహెచ్ఎస్ కోనాయిపల్లి,పి. రామచందర్ రావు, స్కూల్ అసిస్టెంట్ జడ్పిహెచ్ఎస్ మండేపల్లి, ఎమ్. లక్ష్మినారాయణ,స్కూల్ అసిస్టెంట్ జడ్పిహెచ్ఎస్ అవునూర్,కె. రవి, స్కూల్ అసిస్టెంట్ జడ్పిహెచ్ఎస్ గంబీరావుపేట (ఉర్దు మీడియం) ,ఆర్. రాజు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఎంపీపీఎస్ బాబాజీనగర్,పి. ప్రభాకర్, పిడి జడ్పిహెచ్ఎస్ విలాసాగర్,టి. సురేష్, పిడి జడ్పిహెచ్ఎస్ గీతానగర్, కె. శోభారాణి,ఎస్జిటి ఎంపీపీఎస్ ఎల్లారెడ్డిపేట, డి. లచ్చిరెడ్డి,ఎస్జిటి ఎంపీపీఎస్ రంగంపేట, జి. శంకరయ్య, ఎస్జిటి ఎంపీపీఎస్ బాబాజీనగర్,ఏ. మధు, ఎస్జిటి ఎంపీపీఎస్ కనగర్తి, కె. యెల్లరెడ్డి,ఎస్జిటి ఎంపీపీఎస్ సింగారం,ఎన్. శారద, కేజీబీవీ తంగళ్ళపల్లి,కె. పద్మ, కేజీబీవీ వీర్ణపల్లి,ఏ. మధులత కేజీబీవీ వేములవాడ అర్బన్, కె. అర్చన, కేజీబీవీ ఇల్లంతకుంట, కె. కొండల్ రావు, టీజీఎంఎస్ కోనరావుపేట, డా. బి. బాబు, టీజీఎంఎస్ ఇల్లంతకుంట, డి. మంజుల, టీఎస్ఆర్ఈఐఎస్ నేరెళ్ళ

## డెంగ్యూ జ్వరంతో బాలిక మృతి

**బలగం టీవీ , హైదరాబాద్**

హనుమకొండ జిల్లా ఆత్మకూరు గ్రామానికి చెందిన తాళ్ల శ్రీనిత్య(12) డెంగ్యూ జ్వరంతో ఓ ప్రయివేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు బాలిక తల్లి సునీత తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక తండ్రి రవి అనారోగ్యంతో ఏడాది క్రితం మృతి చెందగా వరంగల్‌లో నివాసం ఉంటున్నారు. అక్కడే ఓ ప్రైవేట్ పాఠశాలలో శ్రీనిత్య 5వ తరగతి చదువుతున్నది. వారం రోజులుగా జ్వరం వస్తుండగా, రెండు రోజుల క్రితం తీవ్రమవడంతో హనుమకొండలోని హాస్పిటల్‌లో చేర్పించగా డెంగ్యూ నిర్ధారణ జరిగింది. ఈ క్రమంలో చికిత్స అందిస్తుండగానే మంగళవారం మృతి చెందినట్లు బాలిక తల్లి తెలిపారు.



ఆదిలాబాద్ జిల్లాలోని పెన్ గంగా వంతెన వరద ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రి శ్రీధర్‌బాబు బలగం టీవీ , ఆదిలాబాద్

# ప్రమాదం అంచున ప్రయాణం



- అదుపు తప్పితే హతం
- ప్రమాదకరంగా మారిన రోడ్డు

**బలగం టీవీ , గంభీరావుపేట**

ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్ల పేట గ్రామం నుండి గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామం వరకు ఇటీవలే నూతనంగా డబల్ రోడ్డు నిర్మించగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. ఎగువ మానేరు మత్తడి దూకడంతో గంభీరావుపేట లింగన్నపేట గ్రామాల మధ్య నూతనంగా హై లెవెల్ బ్రిడ్జి నిర్మించడంతో, తాత్కాలికంగా ఏర్పాటుచేసిన రోడ్డు వరద ఉధృతికి కొట్టుకపోవడంతో సిద్దిపేట, కామారెడ్డి వెళ్లే ప్రయాణికులు గంభీరావుపేట కోరుట్ల పేట,మల్లారెడ్డిపేట నుండి ప్రయాణించాల్సి వస్తుంది.కోరుట్ల పేట,మల్లారెడ్డిపేట నుండి లింగన్నపేట గ్రామాల నుండి వెళ్లే ప్రయాణికులకు ఇటీవల నిర్మించిన డబుల్ రోడ్డు కోతులకి గురి కావడంతో , అటువైపు వెళ్లే ప్రయాణికులను బెంబేలెత్తిస్తుంది.ఏమాత్రం అదమరచి అదుపుతప్పి డ్రైవింగ్ చేసినట్లయితే ఆ రోడ్డుకి అవతల పడి ప్రాణాలు పోవడం ఖాయం అనే సంకేతాలు కళ్ళముందే కనబడుతున్నాయి. నిత్యం రహదారి వెంబడి వందలాది వాహనాలు సిద్ధిపేట నుండి కామారెడ్డి రాకపోకలు సాగుతున్నాయి, ప్రమాద భరితంగా రహదారి నీ రిపేరు చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

- 9 మంది మావోయిస్టుల మృతి

**బలగం టీవీ , హైదరాబాద్**

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మంగళవారం భద్రతా దళాల ఎదురుకాల్పులలో 9 మంది మావోయిస్టులు మరణించినట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు ప్రకటించారు. దంతెవాడ, బీజీపూర్ జిల్లాల సరిహద్దుల వెంబడి ఉన్న అడవులలో ఉదయం 10.30 గంటల ప్రాంతంలో కాల్పుల పోరు ప్రారంభమైనట్లు జస్టర్ రేంజ్ ఐజి సుందర్‌రాజ్ పి తెలిపారు. జిల్లా రిజర్వ్ గార్డు, సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్‌లతో కూడిన భద్రతా దళాల ఉమ్మడి బృందం మావోయిస్టుల కోసం గాలింపు జరుపుతుండగా కాల్పుల పోరు జరిగినట్లు ఆయన చెప్పారు.

కొన్ని గంటల పాటు జరిగిన కాల్పుల పోరు అనంతరం యూనిఫాం ధరించిన 9 మంది మావోయిస్టుల మృతదేహాలు అడవిలో లభించినట్లు ఆయన చెప్పారు. ఆ ప్రదేశంలో భారీ స్థాయిలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి లభించినట్లు ఆయన తెలిపారు. ఈ కాల్పుల పోరులో భద్రతా సిబ్బంది సురక్షితంగా ఉన్నారని, గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు. బస్తర్ ప్రాంతంలో దంతెవాడ, బీజాపూర్‌తోసహా ఏడు జిల్లాలు ఉన్నాయి. నేటి సంఘటనతో ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో మొత్తం 154 మంది మావోయిస్టులు మరణించారు.

## రాజస్థాన్‌లో ఎస్ఐ పరీక్ష పేపర్ లీక్

**బలగం టీవీ , జైపూర్**




రాజస్థాన్‌లో పేపర్ లీకేజీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పేపర్ లీకేజీతో అన్నాచెల్లెలు ఎస్ఐ పరీక్షల్లో ఉత్తీర్ణతీ సాధించినట్టు తెలుస్తోంది. 2021లో పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ పరీక్షల్లో శోభా రైకా స్టేట్ ఐదో ర్యాంకు సాధించారు. ట్రైనింగ్ సమయంలో ఆమె ప్రతిభ చూ పి ంచ క పో వ డ ం తో అధికారులకు అనుమానాలు వ్యక్తమయ్యాయి. శోభాను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా లీకేజీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆమె తండ్రి రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో సభ్యుడిగా ఉన్నారు. గతంలో శోభా సోదరుడు ఎస్ఐ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. శిక్షణలో పెద్దగా రాణించకపోవడంతో అప్పుడు కూడా పేపర్ లీకై ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇద్దరిని అదుపులోకి తీసుకొని లోతుగా విచారిస్తున్నారు. గతంలో ఎస్ఐ పేపర్ లీకేజీ వ్యవహారంలో 66 మంది అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అరెస్టైన వారిలో 33 మంది అభ్యర్థులు ఎస్ఐ ట్రైనింగ్ తీసుకుంటుండగా నలుగురు అభ్యర్థులు మాత్రం వివిధ స్టేషన్లలో ఎస్ఐలుగా విధులు నిర్వహిస్తున్నారు.

## అమెరికాలో 'ట్రిపుల్ ఈ' వైరస్ కలకలం

**బలగం టీవీ , వాషింగ్టన్**



అమెరికాలోమరో ప్రాణాంతక వైరస్ ఆందోళన కల్గిస్తోంది. దోమకాటు కారణంగా అమెరికాలోని మసాచుసెట్స్ రాష్ట్రంలో ట్రిపుల్ ఈ వైరస్ బారిన ప్రజలు పడుతున్నారు. తాజాగా ఈ వైరస్ సోకిన న్యూహాంప్ షైర్ కు చెందిన వ్యక్తి ఒకరు మృతి చెందినట్లు తెలుస్తోంది. మరో 80 ఏళ్ల వృద్దుడు ఆసుపత్రిలో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతుండటం చర్చనీయాంశంగా మారింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. ముందస్తు జాగ్రత్తగా అక్కడి ఐదు పట్టణాల్లో పాక్షిక లాక్ డౌన్ విధించారు. ఈ వైరస్ సోకిన వారిలో జ్వరం, తలనొప్పి, వికారం, వాంతులు, డయేరియా, ఫిట్స్ వంటి లక్షణాలు కనబడతాయి. దోమకాటు మూలంగా ఈ వైరస్ విస్తరిస్తుంది. ట్రిపుల్ ఈ వైరస్ కు ఎలాంటి మందు లేదని కావున ఎవరికివారు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక యంత్రాంగం సూచిస్తోంది. వైరస్ సోకిన వారిలో 33 నుండి 70 శాతం మంది మరణించే అవకాశాలు ఉన్నాయని యూఎస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ సీడీసీ హెచ్చరించింది. ఇన్ ఫెక్షన్ సోకిన ఇతరుల్లో నరాల సమస్య వెంటాడుతాయని వెల్లడించింది.

# ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నీటి విడుదల



- రాష్ట్ర ఐటీ పరిశ్ర మలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

**బలగం టీవీ , హైదరాబాద్**

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిని ప్రణాళికబద్ధంగా నీటిని విడుదల చేస్తున్నామని రాష్ట్ర ఐటీ పరిశ్ర మలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు లోకి చేరుతున్న నీటిని పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ గోదావరి నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రాజె క్టు నుంచి ప్రణాళిక ప్రకారం నీటిని విడుదల చేస్తున్నారన్నారు.అధికార యంత్రాం గం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అత్యవసర సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజలకు అత్యవసర సేవల నిమిత్తం అధికారులను సంప్రదించాలన్నారు. అధికారు లు చేపడుతున్న రక్షణ చర్యలకు ప్రజాప్రతినిధులు పూర్తిగా సహకరించాలని తెలిపారు. ప్రాజెక్టు సమీపంలోని 70 ఎకరాలను పర్యాటక ప్రాంతానికి వినియోగిస్తామ న్నారు. ప్రాజెక్టు పనులు పూర్తికావడంతో త్వరలో సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభించేం దుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్‌లు కుమార్ దీపక్, కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్, అదనపు కలెక్టర్ మోతిలాల్, డీసీపీ భాస్కర్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, ఏసీపీ ప్రకాష్, తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే, ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి, ఇంజనీర్లు పాల్గొన్నారు.

# జూన్ 11 నుంచి డబ్ల్యూటీసీ ఫైనల్




- **తొలిసారి లార్డ్స్ స్టేడియం వేదికగా పోరు..**

**బలగం టీవి, లండన్**

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ అంతిమ పోరు తేదీని ఐసీసీ ప్రకటించింది. 2025 జూన్ 11 నుంచి 15వ తేదీల మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ నిర్వహిస్తామని ఐసీసీ తెలిపింది. అలాగే ఈసారి కూడా ఇంగ్లండ్ వేదికగా ఫైనల్ జరగనుంది. అయితే.. తొలిసారి లార్డ్స్ స్టేడియం డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆతిథ్యమివ్వనుంది. ఈ విషయాన్ని మంగళవారం అంతర్జాతీయ క్రికెట్ మండలి వెల్లడించింది.

డబ్ల్యూటీసీ ఫైనల్‌కు లార్డ్స్ స్టేడియం వేదికవ్వడం ఇది మొదటిసారి. తొలి సీజన్‌లో టీమిండియాను ఓడించిన న్యూజిలాండ్ టెస్టు గదను ముద్దాడింది. 2022-23లో కూడా భారత్ ఫైనల్ చేరినా ఆస్ట్రేలియా ధాటికి నిలవలేక ట్రోఫీని చేజార్చుకుంది. అయితే ఈసారి డబ్ల్యూటీసీ ఫైనల్ చేరేది ఎవరు? అనేది ఇంకా తెలియాల్సి ఉంది.

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2024-25 సీజన్‌లో టాప్ -2లో ఉన్న రెండు జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ప్రస్తుతం టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత జట్టు అగ్రస్థానంలో ఉంది. ఆస్ట్రేలియా రెండో స్థానంలో కొనసాగుతోంది. త్వరలోనే సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో రెండు టెస్టులు.. ఆ తర్వాత కంగారూ గడ్డపై బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా ఆడనుంది.

ఇక న్యూజిలాండ్, ఇంగ్లండ్‌లో మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నాయి. వెస్టిండీస్‌పై ఈమధ్యే టెస్టు సిరీస్ గెలుపొందిన దక్షిణాఫ్రికా జట్టు ఐదో స్థానంలో నిలిచింది. ఇక పాకిస్థాన్‌పై చారిత్రాత్మక విజయంతో టెస్టు సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన బంగ్లాదేశ్ ఆరో స్థానానికి దూసుకొచ్చింది. శ్రీలంక, పాకిస్థాన్, వెస్టిండీస్‌లు వరుసగా 7, 8, 9 స్థానాల్లో ఉన్నాయి.

# పాకిస్థాన్‌పై బంగ్లాదేశ్ క్లీన్ స్వీప్




**బలగం టీవి, రావల్పిండి**

పాకిస్థాన్ జట్టు భారీ షాక్ తగిలింది. పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్ క్లీన్ స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది. రెండో టెస్టులో ఆరు వికెట్ల తేడాతో బంగ్లా విజయం నమోదు చేసింది.

రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 185 రన్స్ టార్గెట్‌తో మంగళవారం బ్యాటింగ్ ప్రారంభించిన బంగ్లాదేశ్ 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకున్నది. బంగ్లా బ్యాటర్లలో జాకిర్ హసన్ 40, ఇస్లామ్ 24, షాంతో 38, మోహుల్ హక్ 34 రన్స్ చేసి ఔటయ్యారు. ముష్ఫికిర్(22), షకీబ్(21)లు నాటౌట్‌గా నిలిచారు.

ఓటమి నుంచి తప్పించుకునేందుకు షాన్ మసూద్ నేతృత్వంలోని పాక్ జట్టు తీవ్ర ప్రయత్నం చేసింది.ఇప్పటి వరకు బంగ్లాదేశ్ విదేశాల్లో రెండు టెస్టు సిరీస్‌లను గెలుచుకున్నది. 2009లో వెస్టిండీస్‌తో, 2021లో జింబాబ్వేతో జరిగిన సిరీస్‌ల్లో విజయం సాధించింది.

**స్కోరుబోర్డు**
**పాకిస్థాన్ 274, 172**
**బంగ్లాదేశ్ 262, 185**

# భారత్‌ను ఓడించడం పెద్ద కష్టం కాదు : నజ్ముల్ హుస్సేన్




**బలగం టీవి, రావల్పిండి**

పాక్‌పై బంగ్లా సిరీస్ విజయం సాధించిన అనంతరం బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ మాట్లాడారు. 'ఈ విజయం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఈ అనుభూతిని మాటల్లో వర్ణించలేకపోతున్నా. జట్టులోని ప్రతీ ఒక్కరు అద్భుత ప్రదర్శన కనబర్చారు. తమ ఆటతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా మా పేసర్లు అసాధారణ ప్రదర్శన కనబర్చారు.అందుకే ఈ సిరీస్‌లో మేం విజేతగా నిలిచాం. జట్టులోని ప్రతీ ఒక్కరు విజయం కోసం నిజాయితీగా కష్టపడ్డారు. ఇదే జోరును కొనసాగిస్తారని ఆశిస్తున్నా. గాయంతో జాయ్ దూరమైనా.. షెడ్‌మన్ అద్భుతంగా ఆడాడు. జకీర్ కూడా అదరగొట్టాడు. ఈ సిరీస్‌లో మాకు ఎన్నో సానుకూలంశాలు లభించాయి. మా తదుపరి సిరీస్ భారత్‌తో ఉంది.ఈ సిరీస్ మాకు ఎంతో ముఖ్యం. పాకిస్థాన్ గడ్డపై సాధించిన ఈ సిరీస్ విజయం ఎంతో ఆత్మ విశ్వాసాన్నిచ్చింది. మా జట్టులో అనుభవం కలిగిన ఆటగాళ్లు ఎందరో ఉన్నారు. మెహిదీ హసన్, షకీబ్, ముష్ఫికర్‌లు ఇదే జోరు కొనసాగిస్తే భారత్‌ను ఓడించడం పెద్ద కష్టం కాదు. జట్టులోనే ఆటగాళ్లు కూడా విజయంలో భాగమయ్యారు.'అని నజ్ముల్ హుస్సేన్ షాంటో చెప్పుకొచ్చాడు. సెప్టెంబర్ 19 నుంచి భారత్ వేదికగా బంగ్లాదేశ్ రెండు టెస్ట్‌ల సిరీస్ ఆడనుంది.

# గోపీచంద్ విశ్వం టీజర్ విడుదల




**బలగం టీవి, హైదరాబాద్**

గోపీచంద్ నుంచి వస్తోన్న తాజా చిత్రం విశ్వం. ఈ చిత్రానికి శ్రీను వైట్ల దర్శకత్వం వహిస్తున్నాడు. మేకర్స్ ముందుగా ప్రకటించిన ప్రకారం టీజర్‌ను లాంచ్ చేశారు. తనకు కాబోయేవాడు ఎలా ఉండాలో హీరోయిన్ చెప్పే సంభాషణలతో మొదలైంది టీజర్. నరేశ్, ప్రగతి, వెన్నెల కిశోర్‌తోపాటు షకలక శంకర్, అజయ్ ఘోష్ కాంబోలో సాగే కామింగ్ టైమింగ్ సినిమా మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతుందని విశ్వం టీజర్ చెప్పకనే చెబుతోంది. ఇప్పటికే జర్నీ ఆఫ్ విశ్వం అంటూ షేర్ చేసిన వీడియోలో ఫన్, సీరియస్ ఎలిమెంట్స్‌తో సాగుతూ.. ఇండియా అప్పుల్లో రెండో స్థానంలో ఉండటానికి కారణం మోసం. నేరాల్లో ఐదో స్థానంలో ఉండటానికి కారణం మోసం.. నేనిక్కడుండటానికి కారణం మోసం అంటూ ఫన్నీ మ్యానర్‌లో సాగుతున్న సంభాషణలు శ్రీనువైట్ల మార్క్‌తో ఇంప్రెసివ్‌గా సాగుతున్నాయి.

ఈ మూవీని చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై పాపులర్ డిస్ట్రిబ్యూటర్ కమ్ ఎగ్జిబిటర్ వేణు దోనెపూడి పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి తెరకెక్కిస్తున్నారు. గింజ గింజపై తినేవాడి పేరు రాసి ఉంటుంది. దీనిపై నా పేరు ఉంది.. అని ఫస్ట్ స్ట్రైక్‌లో గోపీచంద్ చెబుతున్న డైలాగ్స్ సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ మూవీలో కావ్యథాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. గోపీమోహన్ స్క్రీన్ ప్లే సమకూరుస్తుండగా.. చేతన్ భరద్వాజ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



# తెలుగు రాష్ట్రాలకు భారీ విరాళం ప్రకటించిన సినీ ప్రముఖులు







**బలగం టీవి, హైదరాబాద్**

వరద బాధితుల కోసం సీఎం సహాయ నిధికి విరాళాలు అందించాలని ఇరురాష్ట్రాల సీఎంలు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ పిలుపునకు పలువురు సినీ ప్రముఖులు స్పందించి భారీ విరాళాలు ప్రకటించారు. హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ తెలుగు రాష్ట్రాల సీఎంల సహాయనిధికి కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించారు. బాధాతప్త హృదయంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు తనవంతు బాధ్యతగా బాధిత ప్రజల సహాయార్థం విరాళంగా అందిస్తున్నానని ఆయన తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆయన ప్రకటన చేశారు.

ఇక టాలీవుడ్ స్టార్ నటుడు జూనియర్ ఎన్టీఆర్ కూడా రెండు తెలుగు రాష్ట్రాలకు ఆర్థిక సాయం ప్రకటిం చారు. తన వంతు సాయంగా ఒక్కో రాష్ట్రానికి రూ.50 లక్షలు చొప్పున మొత్తం రూ.కోటి విరాళంగా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం ఎక్స్ వేదికగా ప్రకటించారు.

సినీ హీరో విశ్వక్‌సేన్ రెండు తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితుల సహాయార్థం రూ.10లక్షలు విరాళంగా ప్రకటించారు. తన వంతు సాయంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమంత్రి సహాయ నిధికి చెరో రూ.5 లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ట్వీట్ పెట్టారు.

అలాగే టాలీవుడ్ క్రేజీ హీరో సిద్దూ జొన్నలగడ్డ సైతం ఏకంగా రూ.30 లక్షల భారీ విరాళం ఇచ్చాడు. ఏపీకి రూ.15 లక్షలు, తెలంగాణకు రూ.15 లక్షలు ఇచ్చాడు. ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలో ఎదుగుతున్న సిద్దూ.. అన్ని లక్షల ఇవ్వడం అంటే మాములు విషయం కాదు.

